క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మద్దిలపాలెం: ఈపీడీసీఎల్ జోన్–1 ఇసుకతోట ఫీడర్ పరిధిలో శుక్రవారం మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్–1 ఈఈ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుకతోట మెయిన్ రోడ్డు, లాసన్ టవర్ నుంచి వాసుదేవ ఫంక్షన్ హాల్ వరకూ, అలాగే జీఆర్ నగర్, వెంకోజీపాలెం తదితర ప్రాంతాల్లో ఉదయం 2 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

10న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సమావేశం

మద్దిలపాలెం: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సమావేశాన్ని ఈనెల 10వ తేదీన డాక్టర్ బుల్లయ్య కళాశాలలో నిర్వహించనున్నామని నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో గల గాంధీ సెంటర్ ఆవరణలో సాయంత్రం 5 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఆచార్య ఎ.డి.పాల్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్.టి. రామారావు శత జయంతి ఉత్సవాలకు సంబంధించి చర్చించనున్నామన్నారు.

ఉత్సాహంగా విద్యార్థుల కోలాటం



కోలాటమాడుతున్న విద్యార్థులు

గాజువాక : గాజువాక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు బుధవారం కోలాటం నేర్పించారు. గ్రంథాలయాధికారి బి.చంద్రకళ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కోలాటం అనంతరం యోగా గురు ఎం.లీలాదుర్గ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలను నేర్పించారు. ఈ సందర్భంగా వారితో వివిధ ఆటలను ఆడించారు.

షరతులు లేని వేతన ఒప్పందం చేయాలి

డాబాగార్డెన్స్: ఎటువంటి షరతులు లేని వేతన ఒప్పందం వెంటనే చేయాలని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్, డాక్‌వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం పోర్టు ప్రధాన గేట్ సీహార్స్ జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి బి. జగన్ మాట్లాడుతూ ద్వైపాక్షిక వేతన సంప్రదింపుల కమిటీలో యాజమాన్యం నుంచి 13 మంది, ట్రేడ్ యూనియన్ నుంచి 13 మంది ఉన్నారన్నారు.
మేజర్ పోర్టులో పని చేస్తున్న కార్మికులకు ధరల పెరుగుదలకు అనుగుణంగా ఎంత జీతం ఉండాలో ఈ కమిటీ నిర్ణయం చేస్తుందని, అటువంటి కమిటీని కాదని ఐపీఏ యాజమాన్యం ఐదుగురు సభ్యులతో సబ్ కమిటీ వేయడాన్ని తప్పుపట్టారు. పోర్టు ఆస్పత్రిని పీపీపీ పద్ధతిలో ప్రైవేట్‌కి ఇవ్వడాన్ని విరమించుకోవాలని, పోర్టు స్థలాలు, స్టేడియం, కల్యాణ మండపాలు ప్రైవేట్‌కు ఇవ్వరాదని, సీహెచ్‌డీ క్యాజువల్, పూల్, పోర్టు కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లిమిటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామలింగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ త్రినాథరావు, వీడీఎల్‌బీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సత్యనారాయణ, నర్సింగ్, గణేష్, రాము పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ

సీతంపేట: గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం లలితానగర్ లలితా పీఠంలో కర్ణాటక గాత్ర కచేరీ నిర్వహించారు. ద్వారం త్యాగరాజు శిష్యురాలు అక్కినాపల్లి లక్ష్మీశైలజ అన్నమయ్య, త్యాగరాజ, ముత్తుస్వామి కీర్తనలు ఆలపించి ఆహూతులను అలరించారు. ఈమెకు సరస్వతుల పార్థివ వయొలిన్‌పై, డి.సందీప్ మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి గాయని శైలజను ఆశీర్వదించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు..



కబడ్డీలో శిక్షణ పొందిన వారికి, కోచ్‌కు జ్ఞాపిక, టీ షర్టులు అందజేస్తున్న డీసీపీ విజయసాగర్ నాయుడు



కోచ్‌లకు జ్ఞాపికలు అందజేస్తున్న డీసీపీ, పినాకిల్ ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ ఇందిర

- విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి
- పిల్లలను సన్మార్గంలో పెట్టేందుకు తల్లిదండ్రులు సహకరించాలి
- డీసీపీ విజయసాగర్ నాయుడు
- తోటగరువు హైస్కూల్లో ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం

ఆరిలోవ: క్రమశిక్షణతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని లా అండ్ ఆర్డర్ డీసీపీ విజయసాగర్ నాయుడు అన్నారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆరిలోవ సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో గత నెల 1వ తేదీ నుంచి నిర్వహించిన ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సెలవులను వృథా చేసుకోకుండా, సద్వినియోగం చేసుకునేందుకు ఇటువంటి శిబిరాలు దోహదం చేస్తాయన్నారు.
పిల్లలు చెడు అలవాట్లకు గురి కాకుండా తల్లిదండ్రులు గమనించాలన్నారు. తల్లిదండ్రుల మాట వినని పిల్లల గురించి పోలీసులకు తెలియజేస్తే, వారికి కౌన్సెలింగ్ ఇచ్చి మంచి మార్గంలో పెట్టడానికి ప్రయత్నిస్తారన్నారు. తోటగరువు హైస్కూల్లో చదువుతున్న పిల్లల్లో కొందరు క్రమశిక్షణా రాహిత్యంతో ఉన్నట్లు తెలిసిందని, అలాంటివారిని సక్రమ మార్గంలో పెట్టడానికి వారి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. సుమారు 200మంది పిల్లలకు క్రీడా శిబిరం ఏర్పాటు చేసి, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్, బాక్సింగ్‌తో పాటు యోగా శిక్షణ ఇప్పించిన ఆరిలోవ సీఐని ఆయన అభినందించారు. శిబిరం నిర్వహణలో సహకారం అందించిన పినాకిల్ ఆస్పత్రి నిర్వాహకులకు, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ రాజేష్ వెంకట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శిక్షణ ఇచ్చిన కోచ్‌లు ఎస్.బంగార్రాజు, రామారావు, మీనా, హేమ, సుమన్, జాన్, అప్పలరాజు, ఎల్లాజీ, చైతన్యలను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. శిక్షణ పొందిన పిల్లలకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ద్వారకా ఏసీపీ ఆర్.వి.ఎస్.ఎన్ మూర్తి, హైస్కూల్ హెచ్‌ఎం దుర్గాభవాని, పినాకిల్ అడ్మినిస్ట్రేటర్ ఇందిర, డాక్టర్ కృష్ణ, ఆరిలోవ ఎస్‌ఐలు సూర్యనారాయణ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ
- 29, 30 వార్డుల్లో సుడిగాలి పర్యటన



దిబ్బలపాలెంలో కల్వర్టు పలక విరగడంపై చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ



పెంటవీధిలో సమస్యలపై ఆరా తీస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ బుధవారం పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. జోన్–4 పరిధి 29, 30 వార్డుల్లో జగదాంబ, మహారాణిపేట, పెంటవీధి, దండుబజార్, దిబ్బలపాలెం, కోడిపండ్యాలవీధి, వార్డు బాయ్స్ కాలనీ, రెల్లివీధి తదితర ప్రాంతాల్లో ఆయా కార్పొరేటర్లు ఉరుకూడి నారాయణరావు, కోడూరు అప్పలరత్నంతో కలిసి పర్యటించారు. ఆయా వార్డుల్లో కాలువలు, రోడ్లతో పాటు భూగర్భ మురుగు నీటి కాలువలు పురాతనమైనందున, అవి శిథిలావస్థలో ఉన్నాయని, మురుగునీరు సక్రమంగా ప్రవహించకపోవడంపై వాటిని పునర్నిర్మించాలని, చెత్త తరలించే వాహనాలు సరిగ్గా రావడం లేదని, రెల్లివీధిలో రోడ్డు వెడల్పు చేయాలని కార్పొరేటర్లు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి ఆయన స్పందిస్తూ వార్డులోని ప్రతి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇస్తూ, కొన్ని ప్రధాన సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే రాత్రి వేళల్లో పారిశుధ్య పనులు సరిగ్గా నిర్వహించడం లేదని, అధికారులు దృష్టి సారించాలన్నారు. జగదాంబ జంక్షన్‌లోని ఫుడ్‌కోర్టు సందులో ఆక్రమణలు తొలగించాలని, వార్డుల్లో చెత్త అధికంగా చేరుతుందని, అటువంటి ప్రదేశాలు గుర్తించి ఆ ప్రాంతంలో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పెంటవీధిలో స్థానికులతో మాట్లాడుతూ చెత్త తరలించే వాహనం ప్రతి రోజూ వస్తుందా? లేదా? తడి–పొడి చెత్త ఏ విధంగా వేర్వేరు చేసి ఏయే రంగు డబ్బాల్లో ఇస్తున్నారని ఆరా తీశారు. 30వ వార్డులోని కోడిపండ్యాల వీధిలో ప్రధాన కాల్వల్లో పూడికలు తీయకపోవడం వల్ల మురుగు నీరు సరిగ్గా పోవడం లేదని, వెంటనే పూడికలు తొలగించాలని అధికారులను ఆదేశించారు.

కల్యాణం.. కమనీయం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. ఉదయం 9.30 గంటల నుంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. విశేషంగా హారతులు ఇచ్చారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



మహిళలకు సీమంతం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు అచ్చియ్యమ్మపేట పాఠశాల ఆవరణలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు సీతంరాజు సుధాకర్ సహకారంతో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. వార్డు నాయకులు కొండబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణులకు పసుపు, కుంకుమతో పాటు చీర, స్వీట్లు, పండ్లు, హార్లిక్స్ ప్యాకెట్లు అందించి చిరు సత్కారం అందజేశారు. కార్యక్రమంలో 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, 31వ వార్డు ఇన్‌చార్జి బత్తిన నవీన్‌కుమార్, శ్రీనివాస్, 36వ వార్డు మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ జమీల్, గౌరీష్, ఎల్.అప్పారావు, బి.అప్పారావు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గెడ్డ ఆధునికీకరణ పనులు ప్రారంభం



పార్వతీనగర్‌లో గెడ్డ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు పరిధి పార్వతీనగర్‌లో గెడ్డ ఆధునికీకరణకు బుధవారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీలో సమస్యల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఆరిలోవలో గెడ్డల ఆధునికీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే తోటగరువు నుంచి బాలాజీనగర్ మీదుగా డ్రైవర్స్‌కాలనీ శ్మశానం వరకు గెడ్డ పనులు జరుగుతున్నాయన్నారు. ఇప్పుడు పార్వతీనగర్‌లో రూ 35.80 లక్షలతో గెడ్డ ఆధునికీకరణ పనులు ప్రారంభించామన్నారు. ఇక్కడ మరో గెడ్డ పనులు కూడా కొద్ది రోజుల్లో మొదలుపెట్టనున్నామని తెలిపారు. 11వ వార్డుతో పాటు నగరంలో అన్ని వార్డుల్లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నగరాన్ని సుందరంగా తయారు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి విశాఖ నుంచే పరిపాలన చేయనున్నట్లు తెలిపారు. విశాఖ రాజధాని అయితే ఇక్కడ యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, కె.మోహనరావు, జీవీఎంసీ వర్క్స్ ఏఈ అప్పాజీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ఒత్తిడి దూరం



ప్రసంగిస్తున్న రాజయోగిని మాధురి

గాజువాక : విద్యార్థుల్లో సృజనాత్మకతను మేల్కొలిపే విధంగా ఉపాధ్యాయులు బోధన సాగించాలని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం రాజయోగిని మాధురి సూచించారు. స్థానిక యాపిల్ ఐ స్కూల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో ఆమె ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే చిన్నారులకు ఆధ్యాత్మిక చింతనను అలవాటు చేయాలని, దీనివల్ల ఒత్తిళ్లను తట్టుకొని ప్రశాంతంగా చదువుపై దృష్టి సారించగలరని అన్నారు.

సైకిల్ యాత్రికుడికి సత్కారం



ప్రశాంత్‌ను సత్కరిస్తున్న ట్రస్టు సభ్యులు



సైకిల్ యాత్రలో ప్రశాంత్

కంచరపాలెం: కంచరపాలెం నుంచి నేపాల్ వరకు సైకిల్ యాత్ర చేసిన చేసిన ప్రశాంత్‌ను కంచరపాలెం దుర్గానగర్‌లోని హన్నాహ్ అనాథాశ్రమంలో ట్రస్టు సభ్యులు బుధవారం ఘనంగా సత్కరించా రు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'బేటీ బచావో– బేటీ పడావో' నినాదంతో దేశ వ్యాప్తంగా 26 రోజులు 2370 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేసినట్లు ప్రశాంత్ తెలిపారు. ముఖ్య అతిథి ధాత్రి ఫౌండేషన్ చైర్మన్ సీహెచ్ విశాలక్ష్మి, ఇతర ప్రముఖులు ప్రశాంత్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ధాత్రి విశాలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో మహిళలపై వివక్షను అరికట్టడానికి సైకిల్ యాత్ర చేయడం ఎంతో అభినందనీయమన్నారు. సామాజిక సేవకురాలు అనురాధ స్ఫూర్తితో ఆమె కుమారుడైన ప్రశాంత్ మహిళలపై జరుగుతున్న నేరాలను నివారించాలని యాత్ర చేయడం ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం సైకిల్ యాత్ర విజయోత్సవ కేక్‌ను ప్రశాంత్ కట్ చేసి అనాథ పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ అనురాధ, సభ్యులు ఆనందరావు, శ్రీనివాసరావు, అర్జున్, సురేష్, హోమ్ చిన్నారులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ఆయా వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, ఫోన్ నంబర్‌ను 89855 15989కు వాట్సాప్ చేయాలి.

ఐక్య పోరాటాలతోనే విజయం



దీక్షలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఓబులేసు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దుర్మార్గమని ఏపీ స్టేట్ ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ ఓబులేసు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 846వ రోజు బుధవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ ప్రయత్నాలను కార్మిక వర్గం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో ప్రజలందరినీ భాగస్వాములు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉక్కు పరిశ్రమను చేజార్చుకోకూడదని అన్నారు. దీక్షలో సంస్థకు చెందిన బ్లాస్ట్‌ఫార్నేస్ విభాగ కార్మికులు కూర్చున్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సాగర సంరక్షణ సమష్టి బాధ్యత

- నేడు ప్రపంచ సముద్ర దినోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆచార్య రామకృష్ణారావు తదితరులు

ఏయూక్యాంపస్: మానవాళి మనుగడకు అవసరమైన ప్రాణవాయువును అధికంగా అందించే సముద్రాలను కాపాడుకుందాం అని కృష్ణ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి సుంకరి రామకృష్ణారావు అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం సమావేశ మందిరంలో బుధవారం ఉదయం నిర్వహించిన ప్రపంచ సముద్రాల పరిరక్షణ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. 2050 నాటికి చేపలు, ఇతర జీవరాశి కన్నా ప్లాస్టిక్ వ్యర్థాలే సముద్రాలలో అధికంగా ఉంటాయని ఒక సర్వేలో తేలిందన్నారు. ఇటువంటి సమయంలో సముద్రాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మానవాళిపై ఉందన్నారు. ఏయూ సైన్స్ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ డీఈ బాబు మాట్లాడుతూ సముద్రాల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. 50 శాతానికి పైగా ప్రాణవాయువును ఇచ్చే సముద్రాల పరిరక్షణ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు ఎస్. బాలప్రసాద్ మాట్లాడుతూ సముద్రాల పరిరక్షణపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. ఏయూ పర్యావరణ శాస్త్ర విశ్రాంత ఆచార్యులు ఈయూబీ రెడ్డి మాట్లాడుతూ సముద్రాలలోకి విష రసాయనాలు, విషపూరితమైన క్రిమిసంహారాలు, భార లోహాలు వెళ్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరనాథ్, జీవ వైవిధ్య మండలి రీజనల్ కోఆర్డినేటర్ జానకిరావు, సిఫా సంస్థ ప్రతినిధి డాక్టర్ శశిప్రభ, గ్రీన్ క్లైమేట్ టీం ప్రతినిధి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

బయో ఇన్నోవేషన్ ఇగ్నిషన్ ప్రోగ్రాంకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఆచార్యులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆ హబ్, మేధో సంపత్తి విభాగం, ది సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ అప్లయిడ్ బయొలాజికల్ సైన్సెస్–ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(టీ క్యాబ్స్–ఇ) సంయుక్తంగా నిర్వహిస్తున్న బయో ఇన్నోవేషన్ ప్రోగ్రాం–2023కు విద్యార్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. వర్సిటీలోని పలు విభాగాలకు చెందిన విద్యార్థులను మౌఖిక పరీక్షల ద్వారా ఈ కార్యక్రమానికి ఎంపిక చేశారు. వర్సిటీ విద్యార్థులు అలేఖ్యా అధికారి, నిఖిల్ చెన్ను, మహాలక్ష్మి వోలేటి, మోనాలిసా చౌదరి, మునీషా కుసుమే, పూర్ణిమ మల్లూరి, ప్రత్యూష సారపు, సునీత గంట ఎంపికయ్యారు. టి క్యాబ్స్ – ఇ వ్యవస్థాపకుడు డాక్టర్ రవికిరణ్ యేడిది, ఐపీఆర్ చైర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరపు విద్యార్థుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను అధికారులు అభినందించారు.

సామాజిక మాధ్యమాల భూమిక కీలకం



సిరాజ్ ఉర్ రెహమాన్‌ను సత్కరిస్తున్న డాక్టర్ చల్లా రామకృష్ణ

ఏయూక్యాంపస్: మత సామరస్యం, ప్రపంచ శాంతిని పెంపొందించడంలో సామాజిక మాధ్యమాల భూమిక ఎంతో కీలకమని పీస్ మెసేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సిరాజ్ ఉర్ రెహమాన్ అన్నారు. సామాజిక మాధ్యమాలలో మత విద్వేషాలను ఎదుర్కోవడం అంశంపై ఏయూ గాంధీ అధ్యయన కేంద్రం, సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని, ప్రసంగించారు. ఈ సందర్భంగా సిరాజ్ మాట్లాడుతూ అసత్య ప్రచారం, ద్వేషాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు.
గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకుడు ఆచార్య చల్లా రామకృష్ణ మాట్లాడుతూ దేశ సమగ్రాభివృద్ధికి ఐక్యతే సాధనంగా నిలుస్తుందన్నారు. వివిధ మతాల మధ్య ఉన్న సారూప్యతలను ప్రచారం చేయడం, మత సహనాన్ని పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు. సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ సామాజిక మాధ్యమాలలో వస్తున్న నూతన విధానాలు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.కిషోర్, సుఫీ నద్వీ, కె.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిరాజ్‌ను కేంద్రం తరఫున డాక్టర్ చల్ల రామకృష్ణ సత్కరించారు.

9,10 తేదీల్లో ఆటోరిక్షా కార్మిక సంఘం మహా సభలు



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆటో రిక్షా కార్మిక సంఘం ప్రతినిధులు

అల్లిపురం: ఈ నెల 9,10 తేదీల్లో విశాఖపట్నం జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) 4వ మహాసభలు టీఎల్ఎన్ సభా హాల్లో జరగనున్నాయని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కె.రెహమాన్ తెలిపారు. సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 1998 నుంచి ఆటో రిక్షా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో జరగనున్న మహాసభలు అత్యంత విశిష్టతను సంతరించుకున్నాయన్నారు. ప్రభుత్వాలు ఆటోడ్రైవర్లపై ఆర్థిక భారం మోపుతూ జీవో నంబర్ 21 తీసుకొచ్చాయన్నారు. ఆటో డ్రైవర్లు యాక్సిడెంట్‌కు గురై చనిపోతే రూ.10 లక్షలు, సాధారణ మరణానికి రూ.5 లక్షలు వర్తించే విధంగా ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యం రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ అదనపు కార్యదర్శి ఎం.మన్మథరావు, సంఘం అధ్యక్షుడు సీఎం రమణ, ఉపాధ్యక్షుడు సీహెచ్ కాసుబాబు, కార్యదర్శి సింహాద్రి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు క్విజ్ పోటీలు



మాట్లాడుతున్న కర్రి అప్పలస్వామి

సింహాచలం: విద్యార్థుల్లో మేధాశక్తి పెంపుదలకు క్విజ్ పోటీలు దోహదపడతాయని అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, రిసోర్స్ పర్సన్లు బి.బి.రాజేంద్రప్రసాద్, సీహెచ్. సూర్యనారాయణరాజు, ఏఈఎస్ భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.